క్లుప్తంగా

87 మందికి వైద్యపరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్‌పాడులో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 87 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యురాలు శ్వేత మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ఆకుకూరలు, గుడ్లు, పండ్లు తీసుకోవాలన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకట రమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన, ఏఎన్‌ఎం భారతీజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శీతలాంబదేవి వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని శీతలాంబదేవి ప్రతిష్ఠ 19వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉదయాన్నే జలపాలేశ్వర ఆలయంలోని గణేష, నవగ్రహవిగ్రహాలు, పోలేరమ్మ, శీతలాంబదేవి(బొడ్రాయి)కి మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చిన జలాలతో అభిషేకాలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం అర్చకులు ఉమాపతి శాస్త్రి విశేష పూజలు, కుంకుమార్చనలు చేస్తారన్నారు. పొంగళ్లు పొంగించి నివేదనలు పెట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారని తెలిపారు.

ఉచిత హాస్టల్ సదుపాయానికి దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ ఇతర కోర్సులను చదువుతున్న ఆర్యవైశ్య విద్యార్థులకు తెనాలిలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగానమ్మపేటలోని వైశ్య విద్యానిధి హాస్టల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఇస్తున్నట్లు చెప్పారు. తెనాలి, పరిసర ప్రాంత, ఇతర జిల్లాల వాసులు కూడ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు హాస్టల్‌లో సంప్రదించాలని సూచించారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి అన్నమయ్య పురస్కారం

తెనాలిరూరల్: మండల గ్రామం కొలకలూరుకు చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి అన్నమయ్య పురస్కారానికి ఎంపికయ్యారు. చిత్తూరుజిల్లా బైరెడ్డిపల్లి మండలం గొల్లచీమన గ్రామానికి చెందిన ఆంధ్ర కళల పరిరక్షణ సమితి, ఏఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషకు, కళారంగానికి, నృత్య, సంగీత రంగాలకు సేవలు అందించిన వారికి ఈ నెల 26న పురస్కారాలు అందజేయనున్నారు. ఈ క్రమంలో ప్రజ్ఞాచారిని అన్నమయ్య పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు ఆంధ్ర కళల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మెడవలి చిరంజీవి మంగళవారం తెలిపారు.

టూటౌన్ పరిధిలో తనిఖీలు

తెనాలిరూరల్: తెనాలి టూ టౌన్ సర్కిల్ కార్యాలయం పరిధిలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్థానిక నందులపేట శివారు భాస్కరావుదిబ్బలో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అలానే సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ ఎ. సుధాకర్ తెలిపారు.

అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలి



కొల్లిపర: రైతులు ప్రతి పంటల్లో వ్యవసాయాధికారుల సూచనలు మేరకు ఏఏ పంటలు సాగుచేయాలి, ఎరువులు ఎంత మోతాదులో వాడాలి అన్న అంశాలను తెలుసుకుని పాటించటం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించటం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సి.సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం పై రైతులకు , రావెప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.సంధ్యారాణి, ప్రొఫెసర్ సువర్ణలత సేంద్రియ వ్యవసాయం, జాతీయ సేవా పథకంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు కొల్లిపర గ్రామంలో వివిధ గృహాలను సందర్శించి సామాజిక ఆర్థిక నివేదికలను సేకరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ కిషోర్ బాబు, టీఓటీ వెంకట రాములు, అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ట్రెజరర్ బి.ప్రభాకర్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ అవుతు కృష్ణారెడ్డి, ఏవో కె.వెంకటరావు పాల్గొన్నారు.

బతుకు బూడిద మయం!

- మట్టితో పోల్చితే తక్కువ ధరకే వీటీపీఎస్ ఫ్లైయాష్
- ఇళ్ల స్థలాల మెరకకు విరివిగా వినియోగిస్తున్న వైనం
- తాడేపల్లి - మంగళగిరిలో ఏ రోడ్డుపై చూసినా బూడిద గుట్టలే
- రోడ్డుమీదకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- లారీలను నిలిపివేయాలని కోరుతున్న స్థానికులు



ఉండవల్లి - అమరావతి రోడ్డులో బస్సువెళుతున్న సమయంలో పైకి లేస్తున్న బూడిద



రోడ్డుపై ఏర్పడిన బూడిద

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థకు వీటీపీఎస్ బూడిద షాక్ తగిలింది. ఏ రోడ్డు చూసినా బూడిద మయం కావడంతో రోడ్డుపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఇది ఎక్కడ బూడిదరా బాబూ అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలోని విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వీటీపీఎస్ కేంద్రం నుంచి బొగ్గు కాల్చగా వచ్చిన బూడిదకు నీటిని కలిపి ఒకచోట డంప్ చేస్తున్నారు. ఆ బూడిద ప్రభావంతో నిన్నమొన్నటి వరకు ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని ప్రజలే ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆ బూడిద షాక్ మంగళగిరి - తాడేపల్లి ప్రాంతాలకు షాక్ ఇస్తోంది. ఆ బూడిద టన్నుల కొద్దీ నిల్వ ఉండడంతో వీటీపీఎస్ అధికారులు దానిని బయటకు పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చౌకగా వస్తుండడంతో..

ఖాళీ స్థలాలు మెరక చేసేందుకు ఆ బూడిదను వినియోగిస్తుండడంతో దానికి డిమాండ్ బాగా పెరిగింది. ఒక లారీ మట్టి రూ.10 వేలు ఉండగా, అది కూడా 30 టన్నుల వరకే వస్తుండగా.. అదే లారీ ఫ్లైయాష్ రూ.4–5వేలు మధ్యలో ఉండి, 40 నుంచి 50 టన్నులు వస్తుండడంతో ఎక్కువమంది వినియోగదారులు బూడిదను తమ స్థలాల్లో మెరక తోలించేందుకు సుముఖత చూపుతున్నారు. వీటీపీఎస్ బూడిదకు డిమాండ్ పెరగడంతో కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం, కృష్ణాయపాలెం, నవులూరు, బేతపూడి, కాజా, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో రాత్రి సమయంలో రయ్ రయ్‌మంటూ బూడిద లారీలు తిరుగుతున్నాయి.

దారి పొడవునా బూడిదే..

వీటీపీఎస్ వద్ద నీటితో కలిపి బూడిదను లోడింగ్ చేయడంతో దారి పొడువునా బూడిద నీళ్లు కారుకుంటూ రోడ్లపై పడుతుంది. కార్పొరేషన్ పరిధిలో శరవేగంగా నిర్మాణాలు జరగడంతో ఈ బూడిదను ఎక్కువశాతం వాడడంతో ఏ రోడ్డు చూసినా బూడిద మయం అవుతోంది. ప్రతిరోజు బూడిద పడిన ప్రాంతాల్లో కార్పొరేషన్ సిబ్బంది శుభ్రం చేసినా బూడిద రోడ్డుకు అంటుకుని వాహనాలు వేగంగా వెళ్లే సమయంలో పైకి లేచి రోడ్డుపై ప్రయాణించే వారి ముఖాలు తెల్లగా అవుతున్నాయి. ఇంతే కాకుండా రోడ్డు పక్కన నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారు, చిరువ్యాపారుల దుకాణాలు బూడిదమయం అవుతున్నాయి. చిరువ్యాపారులు అయితే వారు అమ్మే పండ్లు, కూరగాయలు, ఇతర తినుబండారాలపై పడడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి కార్పొరేషన్ పరిధిలో బూడిద లారీలు తిరగకుండా తగు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ప్రజలు కోరుకుంటున్నారు.

బూడిద తిప్పలు తప్పడం లేదు..



వారానికి మూడు నుంచి నాలుగు రోజులు ఈ బూడిద తిప్పలు తప్పడం లేదు. రోడ్డు మీదకు రావాలంటే భయమేస్తోంది. ఆఫీసుకు వెళుతుంటే మొహంపై, తలపై బూడిద పడి చాలా ఇబ్బంది పడుతున్నాం. కార్పొరేషన్ సిబ్బంది ఎంత రోడ్లు ఊడ్చినా ఆ బూడిద పూర్తిగా పోవడం లేదు. దీనికి నివారణ కార్పొరేషన్ పరిధిలో బూడిద లారీలు తిరగకుండా చేయడం ఒక్కటే. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసరెడ్డి, చిరు ఉద్యోగి, ఉండవల్లి

షాపు బూడిదమయం అవుతోంది



రోడ్డుపై దారి పొడవునా లారీల్లోంచి బూడిద బయటకు వస్తోంది. వాహనాలు తిరిగే సమయంలో భారీగా గాలిలో కలిసి షాపుల్లో ఉన్న వస్తువులపై బూడిద పడుతోంది. వాటిని రోజూ శుభ్రం చేసుకోవాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఏదైనా వాహనం వెళ్లినప్పుడల్లా బూడిద లేవడంతో అది కళ్లల్లో పడితే కళ్లమండిపోతున్నాయి. కార్పొరేషన్ సిబ్బంది ఊడ్చినా పోవడం లేదు. నీళ్లు కొట్టి శుభ్రం చేసినా పూర్తిస్థాయిలో బూడిద పోవడం లేదు. బూడిద రవాణా చేసే వారు ప్రత్యామ్నాయం చూసుకోకపోతే చాలా ఇబ్బందులు పడతాం.

– బత్తుల హరీష్, ఫ్యాన్సీ షాపు యజమాని

రోడ్డు మీదకు వెళ్లాలంటే భయమేస్తోంది



మా ఇల్లు ఉండవల్లి సెంటర్‌లో అమరావతి రోడ్డుకి కొంచెం దూరంలో లోపలకి ఉంటుంది. మా ఇంట్లోకి సైతం బూడిద వస్తోంది. ఉదయం సమయంలో మా నాన్నగారిని తీసుకుని వాకింగ్‌కు వెళ్తాను. ఇంట్లో నుంచి గుంటూరు చానల్ కరకట్టకు వెళ్లేలోపల తలపై పడి తెల్లగా అవుతోంది. కళ్లల్లో పడినప్పుడల్లా కళ్లు మంటలు వస్తున్నాయి. వెంటనే అధికారులు బూడిద రవాణా చేసే లారీలను నివారించకపోతే ప్రజలు రోగాల పాలు కావాల్సి వస్తుంది.

– మధు, స్థానికుడు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: నేడు తాడేపల్లి రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 33 కేవీ విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు కొలనుకొండ, వడ్డేశ్వరం, కుంచనపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిడుముక్కలలో పోలీసుల కార్డన్ సెర్చ్

వివాదాస్పద వ్యక్తులు, అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో విస్తృత సోదాలు



నిడుముక్కలలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ సీహెచ్ ప్రభాకర్, సిబ్బంది

నిడుముక్కల(తాడికొండ): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. సీఐ సీహెచ్ ప్రభాకర్, సిబ్బంది ఆధ్వర్యంలో తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఇళ్లలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. వివాదాస్పద వ్యక్తులు, పాతకేసుల్లో నిందితులు, రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అదేవిధంగా లాం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కౌంటింగ్ రోజున సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐలు అంజయ్య, రవీంద్ర బాబు పలువురు సిబ్బంది ఉన్నారు.

జూన్ 4న రోడ్లపై ర్యాలీలు నిషిద్ధం

- ప్రజలు గుంపులుగా ఉండకూడదు
- తాడేపల్లి ఎస్ఐ రమేష్
- ఇప్పటంలో పోలీసుల కవాతు



ఇప్పటంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తాడేపల్లిరూరల్: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్న సందర్భంగా రోడ్లపై గుమికూడకూడదని ఎటువంటి ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించకూడదని తాడేపల్లి ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు, నార్త్‌జోన్ డీఎస్పీ సీహెచ్ రవికాంత్, తాడేపల్లి సీఐ కల్యాణ్‌రామ్ సూచనల మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ఫలితాల నాడు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నామని, ఎక్కడెక్కడైతే ఎన్నికల నాడు ఘర్షణలకు పాల్పడ్డారో వారందరినీ గుర్తింపు ముందుగా వారిని బైండోవర్ చేసి గొడవలవల్ల జరిగే నష్టాన్ని వారికి వివరిస్తున్నట్లు ఆయన తెలిపారు. తాడేపల్లి రూరల్‌పరిధిలోని 10 గ్రామాల్లో తాడేపల్లి పట్టణ పరిధిలోని 23 వార్డుల్లో ఇప్పటికే పలువురిని గుర్తించి వారిని బైండోవర్ చేశామన్నారు., ఎన్నికల ఫలితాల రోజు ఏ పార్టీవారైనా సరే ర్యాలీలు నిర్వహించడం, భారీగా బాణసంచా కాల్చడం నిషేధమని, ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రతి గ్రామంలో కవాతు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి జయంతి



పంచామృత అభిషేకంలో పరశివానంద భారతి, చైర్‌పర్సన్ రాధిక తదితరులు



హారతిని స్వీకరిస్తున్న భక్తులు

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మీ నృసింహస్వామి జయంతి వ్రతం, పంచామృత అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీపరశివానంద భారతి స్వామి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాన్ని కన్నుల పండువగా జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, కె.శివరామిరెడ్డి, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, విజయకుమారి, భార్గవ్ పర్యవేక్షించారు. జూన్ ఒకటో తేదీన శ్రీహనుమత్ జయంతి సందర్భంగా అభయ వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన ఉంటాయని చంద్రశేఖరరెడ్డి తెలిపారు. జూన్ అయిదో తేదీన శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్నసమారాధన ఉంటాయని, భక్తులు విచ్చేసి పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. స్వామివారి పంచామృత అభిషేకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక-రమేష్ దంపతులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. మున్సిపల్ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, వివిధ రంగాల ముఖ్యులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

సౌత్ డీఎస్పీ మహబూబ్‌బాషా



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

గుంటూరు రూరల్: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రశాంత జీవనానికి పోలీస్ వ్యవస్థ నిరంతరం కృషి చేస్తుందని సౌత్ డీఎస్పీ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు, లాలుపురం, లింగాయపాలెం, అంకిరెడ్డిపాలెం గ్రామాల్లో ఆర్మ్‌డ్ ఫోర్స్, పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యి కౌంటింగ్‌కు దగ్గర పడుతున్న సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు కవాతు నిర్వహించటం జరిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయని అన్నారు.

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల నిర్వహణ చేశామన్నారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కవాతును నిర్వహించామన్నారు. ప్రజా సంరక్షణ పోలీస్ బాధ్యతగా చేపట్టటం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకు వస్తే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు. కాలనీలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో నల్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆర్మ్‌డ్ ఫోర్స్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మెల్లెంపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఓ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై తాడేపల్లి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి రూరల్ పెదవడ్లపూడికి చెందిన గంటా శ్రీనివాసరావు, చిట్టెమ్మ దంపతుల ఏకైక కుమారుడు శ్రీకాంత్ (25) బీటెక్ పూర్తిచేసి వ్యవసాయం మీద మక్కువతో అదే గ్రామంలో వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీన తన సెల్‌ఫోన్ రిపేర్ నిమిత్తం స్నేహితుడైన వినయ్‌కుమార్‌తో కలసి ద్విచక్రవాహనంపై మెల్లెంపూడి మీదుగా విజయవాడ వెళ్తుండగా లంబాడీ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో బండి వెనుక కూర్చున్న శ్రీకాంత్ పైకి ఎగిరి కింద పడడంతో తలకు తీవ్ర గాయమయ్యింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గంటా శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

దొండపాడులో వ్యక్తి మృతదేహం లభ్యం



తాడికొండ: తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో ఒక వ్యక్తి శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం యండ్రాయి గ్రామానికి చెందిన ఎస్.మధుసూధన్ రాజు (36) సోమవారం ఉదయం ఇంటి వద్ద సచివాలయంలో పని ఉందంటూ బయటకు వచ్చాడు. తుళ్లూరు మండలం దొండపాడు పరిసర ప్రాంతాల్లో మద్యం సేవిస్తూ స్థానికులకు కనిపించి రాత్రికి శవంగా మారాడు. స్థానిక వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సమానత్వంతోనే అభివృద్ధి

ఫిరంగిపురం: సామాజిక సమానత్వంతోనే అభివృద్ధి సాధ్యమని సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. మండల కేంద్రంలో నీడైన్ కోచింగ్ సెంటర్లో మంగళవారం బుద్ధజయంతి నిర్వహించారు. ఈసందర్భంగా బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని 200 దేశాలలో బుద్ధుడి జయంతిని నిర్వహిస్తున్నారని చెప్పారు. బుద్ధ భగవానుడి బోధనలకు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆకర్షితుడయ్యాడని తెలిపారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలు బుద్ధుడిని అనుసరించే ఉంటాయన్నారు. రాజ్యాంగంలోని సమానత్వం, గణతంత్రం , ప్రాథమిక సూత్రాలు, హక్కులు, విధులు వీటిలో భాగమేనని చెప్పారు. అందుచేతనే అంబేడ్కర్ ఐదులక్షల మంది తన సహచరులతో బుద్ధిజాన్ని స్వీకరించారని తెలిపారు. కార్యక్రమంలో టి.వీరయ్య, టి.ప్రసాద్, ఆర్.ప్రసాద్, బాబురావు, కాకి రామారావులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కండి

- గుంటూరు 25 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సీఎస్ సిద్ధు
- గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ వార్షిక ట్రైనింగ్ క్యాంప్ నిర్వహణ



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కల్నల్ సీఎస్ సిద్ధు

యనమదల (ప్రత్తిపాడు): ఎన్‌సీసీ క్యాడెట్లకు దేశంపై గౌరవం, సమాజం పట్ల బాధ్యత ఉండాలని గుంటూరు 25వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సీఎస్ సిద్ధు అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో గుంటూరు 25ఏ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వార్షిక ట్రైనింగ్ క్యాంప్ నిర్వహించారు. శిక్షణకు గుంటూరు– పల్నాడు గ్రూపుకు చెందిన 10 కళాశాలలు, 30 పాఠశాలల నుంచి 638 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా కల్నల్ సీఎస్ సిద్ధు హాజరయ్యారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్యాడెట్లు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు దేశంలోని వివిధ రకాల సంస్కృతి సంప్రదాయాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటూ సమాజంలో ఒక పరిపూర్ణమైన వ్యక్తిగా ఎదగాలన్నారు. ఎన్‌సీసీలో విద్యార్థి దశ నుంచే ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

శిక్షణ పొందుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఆప్టికల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, గన్ ఫైరింగ్, ఫిజికల్ ఎక్సర్‌సైజెస్, డ్రిల్ ట్రైనింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. ఆహ్లాదం కోసం ఆటల పోటీలు, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను శిబిరంలో నిర్వహిస్తామని తెలిపారు. కళాశాలలో ట్రైనింగ్ క్యాంప్‌కు అవకాశమిచ్చిన కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ విజయ్ మోహితే, క్యాంపు అడ్జంట్ మేజర్ కుమార్ రాజా, కళాశాల సిబ్బంది బి మల్లికార్జున రావు, ఆర్మీ సిబ్బంది, సివిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేధోశక్తిని పెంపొందించేందుకే సమ్మర్ క్యాంప్



మాట్లాడుతున్న కె.ఝాన్సీలత

కొల్లిపర: విద్యార్థులు వేసవి సెలవుల్లో కాలాన్ని వృథా చేయకుండా వారిలో మేథాశక్తిని పెంపొందించేందుకే గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపును నిర్వహించటం జరుగుతుందని ఎంఈవో కె.ఝాన్సీలత సూచించారు. మంగళవారం గుదిబండివారిపాలెం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సమయం వృథా చేయకుండా చదువు కోవటం వలన కలుగే ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు, రీసోర్స్ పర్సన్ ఎ.స్రవంతి, సీఆర్‌పి పి.రమేష్ పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు దగ్ధం

తెనాలి: పట్టణంలో కేబుల్ టీవీలకు తోడు రకరకాల ఇంటర్‌నెట్ సర్వీసులు రంగప్రవేశం చేశాయి. వీటి లైన్ల కోసం విద్యుత్ స్తంభాలను వినియోగిస్తుండటం తెలిసిందే. రకరకాల వైర్లు, కేబుల్స్ విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోతున్నాయి. విద్యుదాఘాతంతో అప్పుడప్పుడు అగ్నిప్రమాదాలు జరుగుతుండటం పరిపాటైంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో నాజరుపేటలో ఇదే తరహా ప్రమాదం జరిగింది. చెరువువారి వీధి, పులిపాకవారి వీధి మలుపులో గల స్తంభానికి అగ్నిప్రమాదం సంభవించింది. దిగువ నుంచి పైవరకు వున్న కేబుల్ వైర్లు, ఇంటర్నెట్ వైర్లు అన్నీ తగులబడి పోతుండటాన్ని నిద్రలో ఉన్న స్థానికులు గమనించారు. వీరు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ శాఖ డీ1 ఏఈకి దుర్గారావు స్పందించి, విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. స్థానికులు అప్రమత్తం కాకపోతే మంటల సమీప గృహాలకు వ్యాపించేవని చెబుతున్నారు. పట్టణంలో ఇలాంటి ప్రమాదాలు జరగటం ఇది ఆరోసారని తెలిసింది.